క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


నాగేశ్వరరావు


రామారావు

వంగర: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల సర్వేయర్‌గా సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో ఈవోపీఆర్‌డీగా కెల్ల రామారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోపీఆర్‌డీగా పనిచేసిన గొబ్బూరు విజయ్‌కుమార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో విశాఖపట్నం జిల్లాలోని ఆనందపురం నుంచి రామారావు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

మద్యంసీసాల స్వాధీనం


పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎస్ఐ సాగర్‌బాబు

తెర్లాం: మండలంలోని రంగప్పవలస గ్రామంలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న బెల్టుషాపులో విక్రయించేందుకు తరలిస్తున్న 13 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్‌బాబు మంగళవారం తెలిపారు. సంబంధిత వ్యక్తిని అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు కూడా తరలించామన్నారు.

ధ్రువపత్రాల అందజేత


శిక్షణ పొందిన వార్డు సభ్యురాలికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

రాజాం: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. మంగళవారం తరగతుల ముగింపు అనంతరం శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, నిధుల సద్వినియోగం, విధులు, బాధ్యతలపై ఇచ్చిన ఈ శిక్షణలో నేర్పించిన అంశాల ఆధారంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామ సభల్లో గుర్తించిన పనులు, వాటి నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పనులను గ్రౌండింగ్ చేయాలన్నారు. అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు అందజేయాలన్నారు. మండలంలో మొత్తం 89 రకాల పనులకు అనుమతులు లభించాయన్నారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ విక్రయాలపై కేసులు నమోదు చేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పాలిథిన్ కవర్ల విక్రయాలపై కేసులు నమోదు చేయండి అని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్యం లోపిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూప్ హౌస్‌లలో ఇంటి వ్యర్థాలతో ఎరువుల తయారు చేయడాన్ని నవంబరు ఒకటో తేదీ నుంచి ఆరంభించాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని తెలిపారు.

అలరించిన సాయినామ సంకీర్తన

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో మంగళవారం చేపట్టిన సాయినామ సంకీర్తన అలరించింది. భజన మండలి కన్వీనర్ మామిడి విష్ణు ఆధ్వర్యంలో భక్తులు సాయిబాబా గీతాలు ఆలపించి, ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యం.. లాభాల మార్గం!

- డ్రిప్ ఇరిగేషన్‌తో రెండింతల ప్రయోజనం
- నీరు, విద్యుత్ ఆదాతో పాటు ఉత్పాదకతలో పెరుగుదల
- సబ్సిడీపై బిందుసేద్యం పరికరాల పంపిణీ
- రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం


ఎస్.సీతారాంపురంలో బిందు సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ డీడీ లక్ష్మీనారాయణ(ఫైల్)


నాయుడువలసలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

రామభద్రపురం: పంటకు సరైన సమయంలో సక్రమమైన పద్ధతిలో సాగునీరు అందిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ సత్యాన్ని గ్రహించిన వ్యవసాయ నిపుణులు బిందు సేద్యం పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకం కరువు పీడిత ప్రాంతాలకు చక్కగా ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వాలు తక్కువలో తక్కువ 30 నుంచి 50 శాతం సబ్సిడీ సదుపాయం ఈ పథకం కింద ఇస్తే, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రం దాన్ని(సబ్సిడీ) మూడింతలు చేసి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, మిగతా రైతులకు 90 శాతం సబ్సిడీ ఇచ్చి, బిందుసేద్యం వైపు రైతులను ప్రోత్సహించారు. అప్పటి నుంచి బిందు సేద్యానికి రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తుండడంతో డ్రిప్ ఇరిగేషన్‌పై రైతాంగానికి మక్కువ పెరిగింది. ముఖ్యంగా నీటి లభ్యత తక్కువగా ఉండే మండలాల రైతులకు ఇది లాభసాటిగా మారింది. వ్యవసాయానికి తక్కువ నీటిని వినియోగిస్తూ పంటలను సాగు చేసేందుకు బిందు సేద్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ఏడాది జిల్లాలో 1200 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం చేపట్టేందుకు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 600 హెక్టార్లలో సేద్యం చేస్తున్నారు.

బిందు సేద్యానికి అనువైన పంటలు..

మామిడి, జీడిమామిడి, కొబ్బరి, పామాయిల్, సపోటా, జామ, చెరకు, పత్తి, మొక్కజొన్న, మల్బరి, కూరగాయలు వంటి పంటలు బిందు సేద్యానికి అనువైన పంటలు.

ఉపయోగాలు ఇవీ..

వ్యవసాయంలో నీరు, పోషకాల పంపిణీకి ఇరిగేషన్ విధానం అత్యంత ప్రభావవంతమైనదిగా నిపుణులు పేర్కొంటున్నారు. నీరు, పోషకాలు సరైన మోతాదులో పంటకు అందించవచ్చు. ఆవిరి, ప్రవాహాల కారణంగా కలిగే నీటి కష్టాలను తగ్గిస్తుంది. సంప్రదాయ నీటిపారుదల పద్ధతులతో పోలిస్తే ఈ విధానంలో 30 నుంచి 50 శాతం వరకు తక్కువ నీటి వినియోగంతో పంటలు సాగు చేయవచ్చు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థతో సరైన తేమ స్థాయిలు ఉండేలా చూసుకోవచ్చు. కలుపుమొక్కలు పెరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఇది ఎంతో ప్రయోజనకరం.

సబ్సిడీపై పరికరాలు..

బిందు సేద్యం పరికరాలను రాయితీ(సబ్సిడీ)పై ఇస్తున్నారు. 5 ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందజేస్తున్నారు.

అర్హులు వీరే..

బోరుబావి ఉండి, విద్యుత్ సర్వీస్ కలిగిన రైతులు బిందుసేద్యం పథకానికి అర్హులు. అలాంటి రైతులు రైతుసేవా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. కౌలురైతులు అయితే సాగు ధృవీకరణ పత్రం పొంది ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి..

బిందు, తుంపర సేద్యాల ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. బిందు, తుంపర సేద్యం చేస్తే సాగునీటి ఆదా, అధిక దిగుబడి వంటి ప్రయోజనం ఉంటుంది. బిందు సేద్యం పరికరాలను రాయితీపై ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించాం. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ, వీహెచ్ఏలు అందుబాటులో ఉండి రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఆధార్, ఆన్‌లైన్ వన్–బి, బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించి, దరఖాస్తు చేసుకోవచ్చు.

– లక్ష్మీనారాయణ, ఏపీఎంఐపీ డీడీ, విజయనగరం.

ప్రాథమిక చికిత్సపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలిరూరల్: ప్రాథమిక చికిత్సపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి, బాడంగి మండలాల సీహెచ్‌వోలకు నేచర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు హాజరైన ఆయన.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్సపై అవగాహన అంతగా లేకపోవడంతో పాము, తేలు కాటు బారినపడి కూడా వ్యక్తులు చనిపోవడం జరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. వైద్యసేవల నిమిత్తం రోగిని ఆస్పత్రికి తరలించే ముందు ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా రోగికి కొంత ఉపశమనం కలగడంతో పాటు ధైర్యం కూడా వస్తుందన్నారు.

తూకంలో తేడాలొస్తే కఠిన చర్యలు


గొడౌన్‌లోని బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్‌రావు

తెర్లాం: బియ్యం తూకంలో తేడాలు వస్తే కఠిన చర్యలకు వెనుకాడేది లేదని ఆర్డీవో రామ్మోహనరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్(పౌర సరఫరాల గొడౌన్)లో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బియ్యం, ఇతర సరుకుల నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గొడౌన్‌లో బియ్యం బస్తాలు వరుస క్రమంలో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. బస్తాలను వరుస క్రమంలో ఉంచాలని, చిందర వందరగా ఉంచొద్దని సూచించారు. ఇక్కడి నుంచి రేషన్ డిపోలకు బియ్యం పంపించినప్పుడు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై తూకం వేసి పంపిస్తున్నారా, లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట సీఎస్‌డీటీ స్వర్ణలత, ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా


వీఆర్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా ఉంచాలని తహసీల్దారు ఎం.శ్రీను సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో మంగళవారం సమావేశమైన ఆయన.. వేగావతి నదీ పరివాహక ప్రదేశాల నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం ఉందని, ఇకమీదట ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని తెలిపారు. గ్రామ రెవెన్యూ పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. భూ రికార్డులు సరిచేయాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, వారికి కావాల్సిన సేవలు సకాలంలో అందజేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌డీటీ సుబ్బయ్య, ఆర్ఐ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో 'పొలం పిలుస్తోంది'


బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్

బొబ్బిలిరూరల్: మండలంలోని కలువరాయి, చింతాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందర్ మాట్లాడుతూ పంటలకు సోకిన తెగులును నిర్ధారించుకున్న తర్వాతనే దానికి తగ్గ మందులు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పంటలు పరిశీలించి, వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు రవళి, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతుసేవా కేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఏవో నవీన్ హాజరై, రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పంటను నిరంతరం పరిశీలిస్తుండాలని, ఏదైనా తెగులు బారిన పంట పడితే వెంటనే అప్రమత్తమై, వ్యవసాయ సిబ్బంది సూచనలతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో గోవింద, వీఏఏ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

వంగర: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. మండలంలోని వంగర, ఎం.సీతారాంపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై, రైతులకు పలు సూచనలు చేశారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలించి, తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పంటల సాగు, ఎరువుల వినియోగం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో రాంబాబు, వీఏఏలు చాందిని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన


కోటిపల్లిలో జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో శిరీష, తదితరులు

బాడంగి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గూడెపువలస, కోటిపల్లి గ్రామాల్లోని రైతులకు జిల్లేడు ద్రావణం తయారీ, ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏవో కె.శిరీష తొలుత వరి పంటను ఆశించే తెగుళ్లు, చీడపీడలు వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. అనంతరం జిల్లేడు ద్రావణాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి, ప్రదర్శించారు.

సకాలంలో టీకాలు వేయాలి

వంగర: గర్భిణులు, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలని వైద్యాధికారులు సుష్మితా దయానా, సీహెచ్ జ్యోతిలు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో మంగళవారం సమావేశమైన వారు.. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అపరిశుభ్ర వాతావరణం, కలుషిత నీరు, ఆహారం కారణంగానే వ్యాధులు ప్రబలుతున్నాయన్న విషయం వారు గుర్తెరిగేలా చైతన్యం చేయాలన్నారు.

నేటితో దరఖాస్తు గడువు పూర్తి

బొబ్బిలి: మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి, బుధవారంతో దరఖాస్తు గడువు పూర్తవుతుందని ఎక్సైజ్ శాఖ బొబ్బిలి సీఐ పి.చిన్నంనాయుడు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మద్యం దుకాణాల కోసం మొత్తం 348 దరఖాస్తులు ఇప్పటివరకు వచ్చాయన్నారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని దుకాణాల కోసం 133, బొబ్బిలి మండలంలో దుకాణాల ఏర్పాటుకు 26, రామభద్రపురం మండలానికి 66, తెర్లాం మండలానికి 55, బాడంగి మండలానికి 68 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా తమ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి


ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలిరూరల్: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు రెడ్డి త్రినాథ డిమాండ్ చేశారు. మండలంలోని జె.రంగరాయపురం గ్రామంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అటు దేశంలో ఇటు రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పనులే తప్ప సక్రమమైన పాలన కొనసాగడం లేదని ఆయన విమర్శించారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యుడు అల్లాడిపోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని ధ్వజమెత్తారు. రేషన్ డిపోల్లో బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం, చిన్నశిర్లాం గ్రామాల ప్రధాన రోడ్లలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల లైసెన్స్, వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలన్నింటినీ వెంట తీసుకురావాలని ఎస్ఐ పి.నీలావతి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

రేగిడి: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీ రాఘవ్ అన్నారు. మండలంలోని వన్నలి గ్రామంలో 104 వాహనం ద్వారా ప్రజలకు మంగళవారం వైద్య సేవలు అందించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన సంబంధిత వారాల్లోనే 104 వాహనం వస్తుందని, 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు 64 రకాల మందులు అందించడం జరుగుతుందన్నారు. 104 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ ప్రియా, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎప్పటి సమస్యలు అప్పుడు పరిష్కరిస్తామంటేనే గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో అధికారులు పాల్గొనాలని తెలిపారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అందులోని సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించి, దానిలో శాఖల వారీగా అర్జీలను నమోదు చేయాలన్నారు. మండలంలో అన్ని శాఖలకు సంబంధించి మొత్తం 129 అర్జీలు రాగా వాటిలో ఎక్కువగా భూ సమస్యల అర్జీలు ఉన్నాయన్నారు. రొంపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని, అన్ని గ్రామాల్లో పింఛన్లు అందించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ అర్జీలు వచ్చాయన్నారు. అర్జీల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు తప్పనిసరిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.ప్రశాంత్‌కుమార్, ఎంపీడీవో రత్నం, తహసీల్దారు సులోచనరాణి, బూసాయవలస ఎంపీటీసీ సభ్యుడు మడక తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి


సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దారు సుధాకర్

బాడంగి: బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి తహసీల్దారు కె.సుధాకర్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కొత్తగా విధుల్లో చేరిన మండల సర్వేయరు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు, వీఆర్‌వోలు, జూనియర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. రైతుల భూ సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ మంచిగా పనిచేసి, గుర్తింపు పొందాలన్నారు.


ప్రశాంత్‌కుమార్

రామభద్రపురం: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మండల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావుకు బదిలీ కావడంతో ఈయన స్థానంలో ప్రశాంత్‌కుమార్ వచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి


మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: పండగ వేళ అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. పండగ సమయంలో పాతనేరస్తులు, గంజాయి బ్యాచ్, పేకాట శిబిరాలపై దృష్టి ఉంచాలని తెలిపారు. దొంగతనాలు, దోపిడీలు, చోరీలు, గంజాయి రవాణా వంటివి జరిగే అవకాశం ఉన్నందున అవేమీ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. పండగ రోజుల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

భగవద్గీత మోక్ష ప్రదాయిని


భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత మోక్ష ప్రదాయిని అని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దివ్యజీవన సత్సంగ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. భగవద్గీతను ప్రతిఒక్కరూ చదివి, అందులోని సారాంశాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. భగవద్గీత చదివితే చెడుగీతలు చెరిగిపోతాయన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతిఒక్కరూ తమ బిజీ జీవితంలో పడి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం తగ్గుతూ వస్తోందన్నారు. మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్యస్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటోత్సవం


అమ్మవారి ఘటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


రేగిడి: వన్నలిలో అసిరితల్లి ఆలయం వద్ద ముర్రాటలతో భక్తులు

రాజాం సిటీ: రాజాం గ్రామదేవతల పండగ సందర్భంగా ఘటోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆరో ఘటాన్ని వీధుల్లో ఊరేగించగా, భక్తులు ఘటాన్ని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు అత్యంత వైభవంగా మంగళవారం నిర్వహించారు. భక్తులు ఘటాలు, ముర్రాటలతో ఆలయం వద్దకు చేరుకుని, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు కృష్ణంవలస గ్రామ భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. వేడుకల్లో భాగంగా పలువురు కళాకారులు చేపట్టిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనం


తెర్లాం: నందబలగలో మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గమ్మ


వంగర: రుషింగిలో మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి

రాజాం/వంగర/సంతకవిటి/రేగిడి/బొబ్బిలి/బొబ్బిలి రూరల్/తెర్లాం/రామభద్రపురం/బాడంగి: మండలాల్లోని ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గాదేవి మంగళవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో అమ్మవారు దర్శనమిస్తుండగా, దుర్గతల్లిని చూసి, తరించేందుకు భక్తులు పోటీపడుతున్నారు.